## విశ్వవిద్యాలయాల్లో ఇతర నిర్మాణాలు తగవు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఉన్నత విద్యా, పరిశోధనలకు నిలయమైన విశ్వవిద్యాలయాల్లో ఇతర నిర్మాణాలు చేపట్టడం తగదని తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ (టీఆర్ఎస్‌యూ) రాష్ట్ర కన్వీనర్, బోయ హక్కుల పోరాట సమితి (బీహెచ్‌పీఎస్) యువజన విభాగం తెలంగాణ అధ్యక్షులు బోయ రమేష్ పేర్కొన్నారు. నగరంలోని వ్యవసాయ వర్సిటీలోని కోట్ల విలువ చేసే 100 ఎకరాల స్థలంలో హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 55 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఓయూ క్యాంపస్‌లో డబుల్ బెడ్రూమ్ నిర్మాణానికి చర్యలు చేపట్టగా విద్యార్థులు అడ్డుకున్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల భూములను రక్షించి ఇతర నిర్మాణాలు చేపట్టకుండా ప్రభుత్వం జీవోను జారీ చేయాలని కోరారు.

## పేదల సౌకర్యార్థం అత్యాధునిక కమ్యూనిటీ హాల్



పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**అమీర్‌పేట:** పేద, మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థం ఎస్ఆర్‌నగర్‌లో అత్యాధునిక కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. డబుల్ సెల్లార్, జీ ప్లస్ వన్ విధానంలో నిర్మించిన భవనంలో నిర్మాణం చేపడుతున్నామన్నారు. కరోనా కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని నిధుల కొరత వల్ల నిర్మాణ పనులు నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. పనులు చివరిదశకు చేరాయని అదనపు నిధులు మంజూరైతే పెండింగ్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట హౌజింగ్ అధికారులు రాధాకృష్ణ, స్థానిక అధికారులు ఇందిర, హరిశంకర్, నాయకులు శేషుకుమారి, లలితగోపీచౌహన్, గులాబ్‌సింగ్, బల్‌రాం ఉన్నారు.

## బాలికలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలి



**లాలాపేట:** యాక్షన్ ఎయిడ్ ఆధ్వర్యంలో తార్నాకలోని సెయింట్ ఆన్స్ జనరలేట్‌లో లీడర్ షిప్ క్వాలిటీస్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ వందనపాల్, దివ్య, చిన్మయి తదితరులు యంగ్ అర్బన్ ఉమెన్ ఫ్రం మీ టు వుయ్ వాకింగ్ టుగెదర్ అనే అంశంపై మాట్లాడారు. బాలికలు మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అనంతరం లీడర్ షిప్ క్వాలిటీస్‌పై ప్రత్యేక ఫిల్మ్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుమతి, మౌనిక పాల్గొన్నారు.

## రైల్వేలో 53 మంది పదవీ విరమణ



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న రైల్వే ఉద్యోగులు

**అడ్డగుట్ట:** దక్షిణ మధ్య రైల్వేలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 53 మంది ఉద్యోగులు బుధవారం పదవీ విరమణ పొందారు. హెడ్ క్వార్టర్స్, హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాప్‌లో వీరు విధులు నిర్వహించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సికింద్రాబాద్‌లోని పలు రైల్వే కార్యాలయాల్లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అకౌంట్స్ విభాగం రైల్ నిర్మాణ్ భవన్‌లో సీనియర్ సెక్షన్ ఆఫీసర్ యం. రాజు, రైల్ నిలయంలో సాయికృష్ణ, లేఖా భవన్‌లో ఆదిరెడ్డిను కార్మిక సంఘం నాయకులు షేక్ రవూఫ్, చింతకుంట రామకృష్ణ శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేసి వీడ్కోలు పలికారు.


### రైల్వే మిక్స్‌డ్ హై స్కూల్ హెచ్‌ఎం..



వినోద కుమారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**అడ్డగుట్ట:** లాలాగూడలోని రైల్వే మిక్స్‌డ్ హై స్కూల్ హెచ్‌ఎం వినోద కుమారి పదవీ విరమణ పొందారు. బుధవారం రైల్వే మిక్స్‌డ్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. హెచ్‌ఎం వినోద కుమారి తన 33 ఏళ్ల సర్వీసులో ఎంతో మంది విద్యార్థులకు సేవలందించారన్నారు. విద్యాబోధనకు సంబంధించి ఇటీవల ప్రైమ్ మినిస్టర్ కార్యాలయం నుంచి ప్రశంస పత్రం అందుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

### టీఎస్‌పీసీబీ అటెండర్..



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న అధికారులు

**సనత్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో గత 35 ఏళ్లుగా అటెండర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పీసీబీ అధికారులు ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి హాజరైన చీఫ్ ఇంజనీర్ రఘు మాట్లాడుతూ.. మూడున్నర దశాబ్దాలుగా శ్రీనివాస్ అందించిన సేవలు ఎనలేనివన్నారు. విధి నిర్వహణలో అంకిత భావం, నిబద్ధతతో శ్రీనివాస్ పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు. విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

### రేవతికి డాక్టరేట్



**ఉస్మానియా యూనివర్సిటీ:** డాక్టర్.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగంలో ఐవీ రేవతికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఇంగ్లిష్ విభాగం అధ్యాపకురాలు డా.కె రాణిరజిత మాధురి పర్యవేక్షణలో సెర్చ్ ఫర్ ఐడెంటిటీ అండ్ హ్యూమన్ డైలమా ఏ స్టడీ ఆఫ్ అరుణ్ జోషీస్ నావెల్స్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ఐవీ రేవతిని వర్సిటీ డీన్ డా.చక్రపాణి, ఆలేరు ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపల్ డా.లక్ష్మణ్ నాయక్ అభినందించారు.

చెత్త చెదారం పేరుకుపోయి సౌకర్యాలు లేక బోసిపోయిన పార్కు



# ఉద్యానం.. అధ్వానం

- సౌకర్యాల లేమితో ఎస్‌బీహెచ్ కాలనీ పార్కు
- పచ్చదనం లేక మైదానాన్ని తలపిస్తున్న వైనం
- అభివృద్ధి చేయాలంటున్న కాలనీవాసులు
- విస్మరిస్తున్న అధికారులు



పచ్చదనం లేక మట్టి కనిపిస్తున్న పార్కు ప్రాంగణం

**బౌద్ధనగర్:** ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. పేరుకే పార్కు... కానీ అది మైదానాన్ని తలపించేలా ఉంటుంది. ఎటుచూసినా పచ్చదనం కనిపించాల్సిన పార్కులో కేవలం చెత్తా చెదారంతో కూడిన పరిసరాలే దర్శనమిస్తున్నాయి. బౌద్ధనగర్ డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీ పార్కు పరిస్థితి ఇది. కాలనీలో పార్కు ఉన్నప్పటికీ నెలల తరబడి దాని నిర్వహణ విస్మరిస్తుండటంతో కళావిహీనంగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పార్కుపై దృష్టి సారించి పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### కంకర తేలిన మట్టిపైనే నడక..

పేరుకు కాలనీ పార్కు కానీ అందులో ఒక్క టేబుల్ కూడా ఉండదు. ప్రతీ రోజు ఉదయం సాయంత్రం కాలక్షేపం, వాకింగ్‌కు వచ్చే వారు కాసేపు కూర్చునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. వాకర్స్ నడిచేందుకు వాకింగ్ ట్రాక్ కూడా లేకపోవడంతో ఆ మట్టిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొందని వాకర్స్ వాపోతున్నారు. జామై ఉస్మానియాలోని ఎస్‌బీహెచ్ కాలనీ పార్కులో షెడ్డు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. పార్కుకు ఎక్కువగా వృద్ధులు వస్తుంటారు. వాళ్లు మెడిటేషన్ చేసుకునేందుకు వీలుగా షెడ్డు నిర్మిస్తే సౌకర్యవంతంగా ఉంటుందని కోరుతున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

### ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి



పార్కును అభివృద్ధి చేసి అందులో ఓపెన్ జిమ్ పరికరాలతో పాటు ఆట వస్తువులు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో నిత్యం ఉదయాన్నే వివిధ పనులకు వెళ్లే వాళ్లు సాయంత్రం కాస్త ఆహ్లాదం కోసం పార్కులకు వస్తుంటారు. అలాంటి వారు సేద తీరేందుకు అనువుగా ఉండాల్సిన పార్కు అధ్వానంగా మారింది. అంతే కాకుండా ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఉదయాన్నే వ్యాయామం చేసేందుకు వీలుంటుంది. ఆట వస్తువుల ద్వారా పార్కుకు వచ్చే పిల్లలకు కూడా కాలక్షేపం అవుతుంది.

–శ్రీనివాస్ రెడ్డి, స్థానికుడు

### అధికారులు స్పందించాలి..



పార్కు అనగానే ముందుగా గుర్తుకొచ్చేది పచ్చదనం, అలాంటి పచ్చదనం ఆనవాళ్లు కూడా ఎస్‌బీహెచ్ కాలనీ పార్కులో కనబడవు. మైదానాన్ని తలపించే పార్కు, ఎండిపోయిన చెట్లు, మొక్కలు వాటి ద్వారా పోగయ్యే చెత్త మాత్రమే పార్కులో దర్శనమిస్తుంది. కాలనీలో పార్కు ఉన్నప్పటికీ అది నిరుపయోగంగా మారడానికి కారణం సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు. ఇప్పటికైనా పార్కును అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలి.

–ఎంజే. రెడ్డి, స్థానికుడు

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



**సనత్‌నగర్:** టమాటా రూ.21, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 23, క్యారెట్ 20, దొండ 23, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 35, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 19, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 55, మొరంగడ్డ 23, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

## పీహెచ్‌డీ గడువు పొడిగించండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూలో 2017 పీహెచ్‌డీ బ్యాచ్ థీసిస్ సమర్పణకు గడువు పొడిగించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బుధవారం వీసీ ఛాంబర్ ఎదుట నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. పరిశోధన విద్య పీహెచ్‌డీ కోర్సుకు గడువు విధించడంతో అనేక మంది విద్యార్థులు నష్టపోతున్నారని పీడీఎస్‌యూ నాయకులు నాగేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**రాంగోపాల్‌పేట్:** రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని హైదర్‌బస్తీలో చేపట్టిన పలు అక్రమ నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. బుధవారం టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కిష్టఫర్‌తో పాటు అధికారులు, సిబ్బంది వచ్చి జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. హైదర్‌బస్తీలో ఇంకా చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని వాటికి నోటీసులు ఇచ్చామని త్వరలోనే కూల్చివేతలు చేపడతామన్నారు.

## గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ప్రజా యుద్ధనౌకగా పేరుపొందిన దివంగత ఉద్యమకారుడు గద్దర్ జయంతి సందర్భంగా బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన గద్దర్ చిత్రపటానికి వివిధ సంఘాల విద్యార్థి నాయకులతో పాటు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఓయూలో గద్దర్ పేరుమీద సాహిత్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి పరిశోధనలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నేత నెల్లి సత్య డిమాండ్ చేశారు. సినీ కళాకారులకు నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరుతో పురస్కారాలు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన పట్ల వలిగొండ నరసింహ హర్షం వ్యక్తం చేశారు.

## విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం



వెంకటస్వామిని సన్మానిస్తున్న అధ్యాపకులు

**లాలాపేట:** విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఇతరులకు పంచడం ద్వారానే దానికి సార్థకత ఉంటుందని రిటైర్డు అడిషినల్ కమిషనర్, ఐఎస్‌ఓ విద్యా సంస్థల చైర్మన్, టీఎస్ వెంకటస్వామి అన్నారు. బుధవారం జరిగిన ఐఎస్‌ఓ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజాభివృద్ధికి విద్య ఎంతో కీలకమని పిల్లలకు ఆస్తులు ఇవ్వలేకపోయినా పర్వాలేదు కానీ ఉన్నత విద్యావంతులను చేయాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన క్రీడా సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ వినోదా వెంకటస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి, డీన్ మనోహర్, ప్రిన్సిపాల్ రాజశ్రీ, ప్రదీప్, దివ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయ సదస్సు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్యాట్రిక్ ఆంటోని

**ఉస్మానియా యూనివర్సిటీ:** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల షాద్‌నగర్ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో 'జాతీయ విద్యా విధానం–2020' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలోని ఐపీఈ హాల్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఓయూ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ప్యాట్రిక్ ఆంటోని మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పరిశోధకులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. విద్యార్థులు తమ పీపీటీలను ప్రదర్శించారు. పేపర్ ప్రెజెంటేషన్ చేసిన వారిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో ఎంపికైన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోల్, ప్రొఫెసర్ ఎడీ.దివాన్, ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

## చేనేత వస్త్రాలను ఆదరించాలి

**శ్రీనగర్‌కాలనీ:** నాణ్యతకు మారుపేరుగా ఇండియన్ సిల్క్ గ్యాలరీలోని వస్త్రాలు సిల్క్ మార్క్‌తో చేనేత కళాకారుల ప్రతిభకు తార్కాణంగా నిలుస్తున్నాయని, ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని తెలంగాణ మైనార్టీ మోర్చా వైస్‌ప్రెసిడెంట్, ఫ్యాషన్ డిజైనర్ అల్క మనోజ్ అన్నారు. బుధవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌కు ఆమె సందర్శించి వస్త్రాలను తిలకించారు. ఇక్కడి చీరలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని, చేనేతకారుల ప్రతిభను ప్రశంసించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని, ఫిబ్రవరి 3 వరకు ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

## కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను పర్మనెంట్ చేయాలి

**పంజగుట్ట:** రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను పర్మనెంట్ చేయాలని పలువురు నర్సులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్నామని కరోనా సమయంలో కూడా ప్రాణాలకు తెగించి పని చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తమను పర్మనెంట్ చెయ్యాలని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సులతో కలిసి సమితి అధ్యక్షుడు డాక్టర్ ఇస్లాముద్దీన్, షేక్ సత్తార్ సాహెబ్, సోగరా బేగం, లాజర్‌లు మాట్లాడారు. సమావేశంలో రామ్‌చందర్, చైతన్య, సౌజన్య, మంజుల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా కాంగ్రెస్



చెక్కు అందజేస్తున్న బండి రమేష్

**సనత్‌నగర్:** నిరంతరం పార్టీకి అండగా ఉంటూ విజయంలో కీలకపాత్ర పోషించే కార్యకర్తలకు కాంగ్రెస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన యాదయ్య యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరుపున రూ.2 లక్షల బీమా చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హోసీటోచర్, రమేష్, జైపాల్, నర్సింహ్మాయాదవ్, రాధ పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌లో పోలీసుల బందోబస్తు



**అడ్డగుట్ట:** రైల్వే స్టేషన్‌లో పోలీసులు బుధవారం ఉదయం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ లోకో పైలట్ల ఉద్యోగాల సంఖ్య, వయోపరిమితిని పెంచాలని డిమాండ్‌తో దేశవ్యాప్తంగా రైల్ రోకోకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు భారీ బందోబస్తులు ఏర్పాటు చేశారు.

## రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

**అడ్డగుట్ట:** రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 31న లాలాగూడ- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మధ్యలోని ఆఫ్‌లైన్‌లో సుమారు 35–40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

## భారీ వాహనాలపై కేసులు

**రాంగోపాల్‌పేట్:** నో ఎంట్రీ టైమ్‌లో నగరంలోకి ప్రవేశించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న 26 భారీ వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు మహంకాళి, బేగంపేట్, మారేడుపల్లి, బోయిన్‌పల్లి, తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు మంగళ, బుధవారాల్లో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 26 భారీ వాహనాలు (డీసీఎంలు, టస్కర్స్, టిప్పర్‌లు, రెడీమిక్స్, ప్రైవేటు బస్సులు) అనుమతించని సమయంలో నగరంలోని ప్రవేశించడంతో వాటిపై కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు లేని 14 వాహనాలను ఆర్టీఏ అధికారులకు అప్పగించారు. భారీ వాహనాలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నగరంలోకి అనుమతి లేదని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు.

## ముగిసిన మహాకుంభాభిషేక మహోత్సవాలు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**అమీర్‌పేట:** బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో శతచండీ యాగసహిత మహా కుంభాభిషేక మహోత్సవాలు ముగిశాయి. బుధవారం ఉదయం జరిగిన ప్రత్యేక పూజలకు జగద్గురువు ఆదిశంకరాచార్య కంచికామ కోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ హాజరై ఆలయ రాజగోపురం, ఉప ఆలయాల శిఖరములకు కలశాభిషేక పూజలు జరిపించారు. అంతకు ముందు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన హోమం పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కుంట నాగరాజు, చైర్మన్ సాయిబాబాగౌడ్ తెలిపారు. పూజల్లో కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, పాలక మండలి సభ్యులు ప్రభుగౌడ్, గిరియాదవ్, యాదగిరి, కూతురు నర్సింహ పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



పునర్నిర్మాణ పనులు పరిశీలిస్తున్న విజయేంద్ర సరస్వతి

**చిలకలగూడ :** సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను కంచి పీఠాధిపతి స్వామి శంకర విజయేంద్ర సరస్వతి పరిశీలించారు. మంగళవారం రాత్రి ఆలయాన్ని సందర్శించిన ఆయన ఆలయ కమిటీ ప్రతినిధులతో సమావేశమై పనులపై ఆరా తీశారు. పనులన్నీ అన్ని శాస్త్రల ప్రకారం జరుగుతున్నాయని, సుందరంగా తీర్చిదిద్దుతున్నారని కమిటీ ప్రతినిధులను అభినందించారు. త్వరలోనే మరోమారు ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించేందుకు వస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్లు వేణుగోపాలరావు, లక్ష్మీనారాయణ, ఈఓ రాజేష్‌కుమార్, స్థపతి వలినాయగం, ఇంజినీరింగ్ అధికారులు మల్లికార్జునరెడ్డి, రవీంద్ర, కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మరామసూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, రామచందర్ పాల్గొన్నారు.

## స్టంట్స్, రేసింగ్‌లకు పాల్పడితే చర్యలే




ర్యాలీని ప్రారంభించిన ఏసీపీ శంకర్‌రాజు

ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

**అమీర్‌పేట:** యువకులు స్టంట్లు, రేసింగ్‌లకు పాల్పడి ప్రాణాలు పోగొట్టుకోవద్దని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శంకర్‌రాజు సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం ఎస్ఆర్‌నగర్‌లోని లక్ష్య కాలేజ్ ఆఫ్ కామర్స్, మేనేజ్‌మెంట్ విద్యార్థులు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు నివారణ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ట్రిపుల్ రైడ్, ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే మీతో పాటు ఇతరులు సైతం క్షేమంగా తమ తమ గమ్యస్థానాలకు చేరుకుంటారన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడపాలని మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. అనంతరం 400 మంది విద్యార్థులతో లక్ష్య కళాశాల నుంచి ఎస్ఆర్‌నగర్ ఉమేష్ చంద్ర విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మురళి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయికుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్‌రెడ్డి, హెచ్ఓడీ ప్రియాంక చౌదరి, మణికంఠ,శ్రీ కృష్ణ పాల్గొన్నారు.